ఘనంగా దసరా వేడుకలు




దస్నాపూర్ మైదానంలో రావణుడి బొమ్మ దహనం, వీక్షిస్తున్న ప్రజలు

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : జిల్లాలో శనివారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి మందిరంలో ఇన్‌ఛార్జి పాలనాధికారి వెంకటేష్ ధోత్రే, అదనపు పాలనాధికారి శ్యామలాదేవి రెవెన్యూ దస్త్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ గౌష్ ఆలం, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, హిందూ సమాజ్ ఉత్సవ సమితి బాధ్యులతో కలిసి దస్నాపూర్ దసరా ఉత్సవ మైదానానికి శోభాయాత్రగా తరలివెళ్లారు. అక్కడ అధికారికంగా నిర్వహించిన దసరా ఉత్సవంలో పాల్గొన్నారు.



రెవెన్యూ దస్త్రాలు నెత్తిన పెట్టుకుని శోభాయాత్రకు బయలుదేరుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, చిత్రంలో ఎస్పీ గౌష్ ఆలం, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్, మఠాధిపతి యోగానంద సరస్వతి, హిందూ సమాజ్ ఉత్సవ సమితి బాధ్యులు



భైంసా ప్రధాన రహదారిపై విభాగినుల మధ్య మొక్కలు

అక్కడ భేష్.. ఇక్కడ తూచ్

ఈటీవీ ఆదిలాబాద్ : నిర్మల్, భైంసా మున్సిపాల్టీలతో పాటు దిలావర్‌పూర్ వంటి చోట్ల ప్రధాన రహదారుల విభాగినుల మధ్య ఏర్పాటు చేసిన మొక్కల పెంపకం ఆకట్టుకుంటుంటే ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని రహదారులు సహా డివైడర్ల నిర్వహణ, మొక్కల పెంపకం అధ్వానంగా తయారైంది. పట్టణం నడిబొడ్డున రహదారుల మధ్య ఉండే విభాగినుల మధ్య, తిర్పెల్లి, బెల్లూరి, చాంద వైపు వెళ్లే రహదారి విభాగినుల మధ్య మొక్కలే లేవు.




ఆదిలాబాద్ - తిర్పెల్లి వైపు పాత రహదారి పరిస్థితి ఇది

సామాజిక లెక్కలు.. తొలగనున్న చిక్కులు

● సమగ్ర కుల గణనకు ప్రభుత్వం శ్రీకారం

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే

సమగ్ర సామాజిక వర్గ (కుల) గణనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటింటికి తిరిగి అన్ని కుటుంబాలకు సంబంధించి కులంతో పాటు ఆర్థిక, సామాజిక స్థితిగతులు, విద్య, ఉద్యోగం, ఉపాధి తదితర పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చేందుకు సర్కారు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కులాల వారీగా జనాభా గణనకు అవకాశం చిక్కింది. కులగణన చేపట్టడం ద్వారా ఆయా వర్గాలకు దక్కనున్న ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' కథనం.



◆ రాష్ట్ర జనాభాలో అనధికారిక లెక్కల ప్రకారం కులాల వారీగా జనాభా శాతం పోల్చి చూస్తే ఓసీలు 16 శాతం, బీసీలు 45, ఎస్సీలు 18, ఎస్టీలు 10, ముస్లింలు 11 శాతంగా ఉన్నట్లు అంచనా. ఓసీల్లో రెడ్డి 6 శాతం, కమ్మ 3 శాతం, బ్రాహ్మణ, వైశ్య, తెలగ బలిజ 2 శాతం చొప్పున ఉండగా వెలమ 0.5, ఇతర అగ్రవర్ణాలు మరో 0.5 శాతంగా ఉంది. ఇక ముస్లింలలో ఓసీలు 6 శాతం, బీసీలు 5 శాతంగా ఉన్నట్టు అంచనా.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల శాతం ఇలా...

ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సగటు ఎస్సీ, ఎస్టీ జనాభాతో పోలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారి జనాభా అధికంగా ఉండటం గమనార్హం. రాష్ట్ర సగటులో ఎస్సీల జనాభా 15.5 శాతంగా ఉంది. ఆదిలాబాద్‌లో 14 శాతం, మంచిర్యాలలో అత్యధికంగా 24.7 శాతం నిర్మల్‌లో 15.2 శాతం, కుమురం భీం జిల్లాలో 15.8 కలిపి సగటున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనాభాలో 17.8 శాతం ఎస్సీలు ఉండటం గమనార్హం. ఎస్టీల జనాభా తీసుకుంటే రాష్ట్ర జనాభాలో 9.1 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 31.7 శాతం, మంచిర్యాలలో 7.1, నిర్మల్‌లో 11.4, కుమురంభీం జిల్లాలో 25.9 కలిపి ఉమ్మడి జిల్లాలో సగటున 19.02 శాతం ఎస్టీలు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు కలిపి మొత్తం జనాభాలో 36.82 శాతం ఉండగా మిగిలిన 63 శాతంలో ఓసీ, బీసీలు ఉన్నారు.

పథకాల రూపకల్పనకు అవకాశం

విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం భావిస్తున్న బీసీ జనాభా కంటే కనీసం పది శాతం అధికంగా మొత్తం జనాభాలో 52 శాతం ఉంటుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నారు. గతంతో పోలిస్తే ఓసీ సామాజిక వర్గం జనాభా గణనీయంగా తగ్గి తమ జనాభా పెరిగినట్లు బీసీలు అంచనా వేస్తున్నారు. తమకు జనాభా ప్రాతిపదికన ఫలాలు దక్కాలని పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే ప్రభుత్వ పథకాలు, రాజకీయ అవకాశాలకు మాత్రం లెక్కలు ఉపయోగపడే అవకాశముంది.

గణాంకాల్లో వ్యత్యాసాలు

ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు, ఇతర సందర్భాల్లో ప్రభుత్వాలు అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల ప్రాతిపదికన సమగ్రంగా జనాభా గణన చేపట్టలేదు. దీంతో కొన్ని సామాజిక వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లో కులం ఆధారిత జనాభా శాతం ప్రభుత్వ అంచనాలతో పోలిస్తే ఒకటి, రెండు శాతం అటు ఇటుగా ఉన్నప్పటికీ బీసీల జనాభా విషయంలో మాత్రం గణనీయమైన వ్యత్యాసాలు ఉంటాయని ఆ సామాజిక వర్గం భావిస్తోంది. వందకు పైగా ఉప కులాలు ఉన్న తమ జనాభా ఎక్కువగా ఉన్నా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తమకు అందాల్సిన ఫలాలు అందడం లేదని వారి వాదన. ఉన్నత న్యాయస్థానం కూడా బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర సగటు ఆధారంగా బీసీల జనాభా ప్రస్తుత అంచనా కంటే ఎక్కువగా ఉండే అవకాశముంది. జిల్లాల వారీగా సగటు చూస్తే జనాభా ఎంత ఉండే అవకాశం ఉంది గణన తర్వాతనే తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వినియోగం లభ్యత ఎంత

● భూగర్భ జలాల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు



భూగర్భజలాల వివరాలు సేకరిస్తున్న అధికారులు



	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
వర్షపాతం	1164	1154	1045	1056
నీటి లభ్యత	55,241	59,754	86,868	63,935
వినియోగం	19,730	9,510	24,489	23,282

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లా సాధారణ వర్షపాతం 1150 మి.మీ.లు కాగా సగటున 900 మి.మీ.లకు పైగా కురుస్తోంది. సాధారణ వర్షపాతానికి చేరువలో వర్షం కురిస్తే ఆరు మీటర్ల భూగర్భజలాలు పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఏటా వినియోగం పెరుగుతుండటంతో వనరులు తగ్గిపోయే అవకాశాలున్నాయి. జిల్లాలో ఎక్కువ మంది భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. మిషన్ భగీరథ రాకతో ఉపరితల జలాన్ని ఎక్కువశాతం సద్వినియోగం చేసుకుంటున్నారు.


◆ జిల్లా జనాభా అవసరం మేరకు తాగు నీటిని అందించేందుకు వీలుగా నీటి వనరులు ఉన్నాయి. అయినా అనేక గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. గత ప్రభుత్వం ఉపరితల జలాలను వినియోగించుకునేందుకు జలాశయాల్లోని నీటిని తాగేందుకు వినియోగించుకునేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. వర్షం నీటిని ఇంకించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. గత నివేదిక మేరకు మంచిర్యాల జిల్లాలో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. ఆ తర్వాత నిర్మల్‌లో ఉంది. నీటిని ఇష్టానుసారంగా వినియోగించుకోవడం, వృథా నీటిని భూమిలో ఇంకించే ప్రయత్నాలు చేయకపోవడంతో భవిష్యత్తులో నీటి సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారి పుల్లారావు తెలిపారు. నీటి లెక్కల మేరకు సమస్య ఉన్న మండలాల్లో నీటిని ఇంకించే పథకాలను ప్రవేశపెట్టే అవకాశముందని తెలిపారు.

విలువైన భవనం.. అవుతోంది శిథిలం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే

మాతాశిశు మరణాలను తగ్గించటానికి ప్రభుత్వం రూ.కోటితో నిర్మించిన సమగ్ర అత్యవసర ప్రసూతి, నవజాత సంరక్షణ(కాంప్రహెన్సీవ్ ఎమర్జెన్సీ అబ్‌స్ట్రెట్రిక్ అండ్ న్యూబర్న్ కేర్-సిమాంక్) భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలమైపోతోంది. పదేళ్ల కిందట భవనం నిర్మించినప్పటికీ ఇప్పటి వరకు దాన్ని వినియోగించలేదు. ప్రస్తుతం ఆ భవనం రిమ్స్ ఆధీనంలో ఉందా? లేదా వైద్యారోగ్యశాఖ ఆధీనంలో ఉందా? అనే విషయం సైతం తెలియని పరిస్థితి నెలకొంది. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం నిర్మాణం పనులు ప్రారంభమైన సందర్భంగా నాలుగేళ్ల కిందట అప్పటికే శిథిలం అయిన భవనాన్ని గుత్తేదారు మరమ్మతులు చేయించి వాడుకున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తయి దాదాపు రెండేళ్లు అయింది. ఈ రెండేళ్ల నుంచి మళ్లీ వినియోగంలో లేకపోవటంతో శిథిలం అయిపోతోంది.

సమస్యాత్మక కాన్పులు ఉన్నప్పుడు మాతా, శిశు మరణాలు చోటు చేసుకోకుండా అన్ని వసతులు, సౌకర్యాలతో సిమాంక్ భవనాలు నిర్మించారు. ఆదిలాబాద్‌లో నిర్మించిన భవనం పనులు పూర్తయినప్పటికీ అప్పట్లో వైద్య శాఖకు అప్పగించలేదు. అందులో స్త్రీలు, పిల్లల వైద్య నిపుణులను సైతం నియమించలేదు. భవనం నిరుపయోగంగా మారింది. దొంగలు తలుపులు పగులగొట్టి అందులోని విలువైన సామగ్రి తస్కరించారు. రెండేళ్లుగా భవనం ఖాళీగా ఉండటంతో నిర్వహణ లేక శిథిలం అయిపోతోంది.

అధ్వానంగా.. సిమాంక్ భవనం

సిమాంక్ భవనం తలుపులు శిథిలం అయిపోతున్నాయి. ఎలుకలు కింద తలుపులను కొరికి వేసి రంధ్రాలు చేస్తుండటంతో భవనంలోకి పందికొక్కులు, పాములలాంటి విష కీటకాలు చొరబడి నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి.



భవనం గోడల పక్కన పెరుగుతున్న చెట్లు

సిమాంక్ భవనం వినియోగంలో లేక, నిర్వహణ కరవై భవనం చుట్టూ గోడల పక్కన ఇలా చెట్లు ఏపుగా పెరుగుతున్నాయి.

రూ.9 లక్షల అద్దె డబ్బులు ఎక్కడో..?

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం నిర్మాణం సందర్భంగా గుత్తేదారు సిమాంక్ భవనాన్ని వినియోగించుకొని రిమ్స్ ఆసుపత్రికి రూ.9 లక్షల వరకు అద్దె చెల్లించారు. అయితే ఆ డబ్బులు దేనికి వ్యయం చేశారో తెలియదు. కేవలం రూ.మూడు లక్షలు మాత్రం వైద్య శాఖకు చెల్లించినట్లు సమాచారం. అద్దె డబ్బులతో భవనాన్ని మరమ్మతులు చేయించుకొని వినియోగించుకున్నట్లయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

16న జిల్లాస్థాయి సైన్సు సెమినార్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి జాతీయ సైన్సు సెమినార్, సదరన్ ఇండియా సైన్సు డ్రామా పోటీలు ఈ నెల 16న ఉదయం 10 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2లో నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు. పోటీల వివరాలకు జిల్లా సైన్సు అధికారి రఘురమణ 94400 60288 నెంబరును సంప్రదించాలని సూచించారు.

సెలవులో కలెక్టర్ రాజర్షి షా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కలెక్టర్ రాజర్షిషా వ్యక్తిగత సెలవు పెట్టారు. ఈ మేరకు ప్రభుత్వం కుమురం భీం జిల్లా పాలనాధికారి వెంకటేష్ ధోత్రేకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. ఈ నెల 16వ తేదీ వరకు పాలనాధికారి సెలవు పెట్టడంతో అప్పటి వరకు ఆయన జిల్లా బాధ్యతలను పర్యవేక్షించనున్నారు.

24న ఆదిలాబాద్‌కు కేటీఆర్

● డైట్ మైదానంలో భారీ బహిరంగ సభ



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 24న ఆదిలాబాద్‌కు రానున్నారు. పట్టణంలోని డైట్ మైదానంలో రైతులతో నిర్వహించే సభలో ఆయన పాల్గొనేలా ప్రణాళిక రచిస్తున్నారు. భారీ సంఖ్యలో జనాన్ని తరలించే ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి జోగురామన్న కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. అధికారం కోసం కాంగ్రెస్ బూటకపు హామీలు ఇచ్చిందని విమర్శించారు. జిల్లా కేంద్రంలో కేటీఆర్ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో తరలివచ్చేలా చూడాలన్నారు. అనంతరం డైట్ మైదానాన్ని పరిశీలించారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, రోకండ్ల రమేష్, ఇజ్జగిరి నారాయణ, రౌతు మనోహర్, యూనుస్ అక్బానీ, గోవర్ధన్, రమేష్, సాజిదొద్దీన్, సలీం, ప్రమోద్‌రెడ్డి, సతీష్‌పవార్, లింగారెడ్డి, కుమ్రరాజు, సేవ్వా జగదీష్, ప్రశాంత్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మమత పాల్గొన్నారు.

వసతులు లేక వెతలు

● ఇచ్చోడ డిగ్రీ కళాశాల దుస్థితి

న్యూస్‌టుడే, ఇచ్చోడ

దశాబ్దాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక నిరుపేద యువత విద్యకు దూరంగా ఉండాల్సి వచ్చింది. వ్యయప్రయాసలకు ఓర్చి ప్రైవేటులో చదివేవారు. ఈ సమస్యను గత ప్రభుత్వం పరిష్కరించింది. బోథ్ నియోజకవర్గం ఇచ్చోడలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయడంతో గతేడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. డిగ్రీ కళాశాల దుస్థితిపై కథనం.



వైటీసీ భవనంలో ఏర్పాటు చేసిన ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇచ్చోడలో గతేడాది డిగ్రీ కళాశాల మంజూరైంది. స్థానికంగా ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్)లో ఏర్పాటు చేశారు. ఇందులో కేవలం 4 గదులు మాత్రమే కళాశాలకు కేటాయించారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బీజడ్సీతో పాటు వాటి అనుబంధ ఎంపీసీ సీఎస్, బీజడ్ సీఎస్ గ్రూపులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 98 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా చదువుకునేందుకు కనీస గదులు లేవు. కేవలం రెండు గదులు మాత్రమే విద్యార్థులకు కేటాయించారు. మరో రెండు గదులను కార్యాలయం నిమిత్తం వినియోగిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. నీటి వసతి లేక కనీస సౌకర్యాలు తీర్చుకోలేని దుస్థితి నెలకొంది. విద్యుత్తు సదుపాయం లేదు. బోధనేతర సిబ్బంని నియమించకపోవడంతో అక్కడ ఉన్న అధ్యాపకులే అన్ని విధులు నిర్వర్తిస్తున్నారు. రికార్డుల, పరిశుభ్రత పనులను వారే చేసుకుంటున్నారు.



తరగతులు వింటున్న విద్యార్థులు

నడిచి వెళ్లాల్సిందే..

ఇచ్చోడ బస్టాండ్ నుంచి కళాశాల కిలోమీటరు దూరం ఉంటుంది. ఇక్కడికి నిత్యం నడిచి వెళుతూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇంటి నుంచి ఇచ్చోడకు, అక్కడి నుంచి కళాశాలకు నడిచివెళ్లడం వల్ల ఖర్చుతో పాటు సమయం వృథా అవుతోంది. అన్ని తరగతులకు సరిపడా గదులు, ప్రయోగశాలలు, కార్యాలయం నిమిత్తం ప్రత్యేక గదుల అవసరం ఉంది. ఇప్పటికే ప్రిన్సిపల్‌తో పాటు 10 మంది అధ్యాపకులు, ముగ్గురు అతిథి అధ్యాపకులను నియమించారు. బోధన విషయంలో ఇబ్బందులు లేకున్నా వసతులు లేక అవస్థలు పడాల్సి వస్తోంది.

ప్రజాప్రతినిధులు స్పందించాలి..

ప్రభుత్వ పాలకులతో పాటు ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరముంది. కళాశాల నిర్మాణానికి దాదాపు రెండున్నర ఎకరాల స్థలం అవసరం. ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల రద్దీలో తప్పిపోయిన బాలుడిని డయల్-100 పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్‌లో కుటుంబ సభ్యులతో పాటు వేడుకలను తిలకించటానికి వచ్చిన రంజన-రాజు దంపతుల అయిదేళ్ల కుమారుడు జోండ్లే అముల్ రద్దీలో తప్పిపోయాడు. ఏడుస్తూ తిరుగుతున్న బాలుడిని డయల్-100 పోలీసులు అరవింద్, జియాఉద్దీన్‌లు చేరదీశారు. తల్లిదండ్రులకు అప్పగించారు.

వంద కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. క్రికెట్ ఆడేస్తూ



ఈమె పేరు సుచరిత. చెన్నూరు పట్టణానికి దగ్గరలోని ఓ గ్రామం నుంచి తెల్లవారుజామునే తన క్రికెట్ కిట్‌తో మంచిర్యాలకు పయనమవుతుంది. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో హెచ్‌సీఏ క్రికెట్ శిక్షణ కేంద్రానికి 6 గంటలకే చేరుకుంటుంది. దాదాపు తొమ్మిది గంటల వరకు ఇక్కడ సాధన చేస్తుంది. అబ్బాయిల బౌలింగ్‌లో బ్యాటింగ్ చేస్తూ వారికి సైతం బౌలింగ్ చేస్తుంది. రోజులో 5-6 గంటలు క్రికెట్ శిక్షణకే సమయం కేటాయిస్తుంది. డిగ్రీ పూర్తి చేసుకున్న సుచరిత రాష్ట్ర స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రదర్శన ఇస్తోంది. జాతీయస్థాయిలో ఆడటమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది.

క్రికెట్‌పై ఆసక్తి.. మైదానం బాటపట్టి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పేరుపొందిన నగరాల్లో తప్పితే ఇప్పటికీ అమ్మాయిలు ఆటలెందుకు అనేవారు ఇంకా లేకపోలేదు. అందులో క్రికెట్ అంటే ఆమడదూరం ఉంచుతారు. కొంత మంది అమ్మాయిలకు క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా తల్లిదండ్రుల కోసం తమ ఇష్టాన్ని పక్కన పెట్టడమో, లేక ఇతర ఆటల్లో మొగ్గు చూపడమో చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం దీనిపై మక్కువ చూపిస్తున్నారు. అమ్మానాన్నలను ఒప్పించి మరీ శిక్షణకు సిద్ధమవుతున్నారు. చివరకు వారి ఆసక్తి చూసి నిత్యం కుటుంబ సభ్యులే మైదానానికి తీసుకెళ్తున్నారు. వారి సాధనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. అమ్మాయిలు సైతం క్రమం తప్పకుండా మైదానంబాట పట్టి బ్యాట్, బంతితో ప్రతిభ కనబరుస్తున్నారు. శిక్షకుడి సూచనలు, మెలకువలతో మెరుగ్గా తయారవుతున్నారు.

మక్కువ పెంచుకుని సాధన



జైపూర్ మండలానికి చెందిన ఈమె పేరు సంజన. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఏడాది కిందటి వరకు క్రికెట్ అంటే తెలియదు. కానీ గత సంవత్సరం నుంచి ఈ ఆటపై ఆసక్తి పెంచుకుంది. తన ఆసక్తి చూసి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిరంగి గోపాల్ ప్రోత్సహించడం మొదలు పెట్టారు. శిక్షణ కోసం పాఠశాలలో చిన్నపాటి పిచ్ సిద్ధం చేయించారు. దీంతో అబ్బాయిలతోపాటు సంజన సైతం నిత్యం సాధన చేయడం ప్రారంభించింది. ఇటీవల మంచిర్యాలలోని హెచ్‌సీఏ శిక్షణ కేంద్రానికి వస్తూ మెలకువలను నేర్చుకుంటోంది. శిక్షకుడి సూచనలు శ్రద్ధగా వింటూ బౌలింగ్, బ్యాటింగ్ శైలిని మెరుగుపరుచుకుంటోంది.



అమ్మాయిలకు సూచనలు చేస్తున్న హెచ్‌సీఏ శిక్షణ కేంద్రం శిక్షకుడు ప్రదీప్

పదేళ్లు కూడా లేవు.. బ్యాట్ పట్టేసింది



మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సమన్విక పదేళ్లు కూడా లేవు. బ్యాటింగ్, బౌలింగ్ చేస్తోంది. తన పట్టుదల, క్రమశిక్షణతో శిక్షణ కేంద్రంలోని సీనియర్ క్రీడాకారులతోపాటు శిక్షకుడిని సైతం ఆకట్టుకుంటోంది. ఇప్పటికే కరాటేలో అనేక పతకాలు సాధించిన క్రికెట్‌పై ఆసక్తితో నిత్యం మైదానానికి వచ్చి పరుగు పెడుతోంది. శిక్షకుడి సూచనలను పాటిస్తోంది. తండ్రి సహకారానికితోడు కావడంతో ఈ చిన్నారి క్రమం తప్పకుండా మైదానానికి వస్తోంది. మెరుగైన ఆటతీరుతో జాతీయ స్థాయికి చేరుతానంటోంది.

కష్టాలు అధిగమించి.. కొలువులు సాధించి

మామడ, న్యూస్‌టుడే: జీవితం వడ్డించిన విస్తరిలా అన్నీ ఉన్నా కొంత మంది చిన్నపాటి అవరోధాలకే కుంగుబాటుకు గురవుతారు. అమ్మో తనవల్ల కావట్లేదని ప్రగతి సాధించే ప్రయత్నాలను వదులుకుంటారు. ఇంకొందరు ఏమీ లేకున్నా.. పరిస్థితులన్నీ ప్రతికూలంగా ఉన్నా భవిష్యత్తును బంగారు బాట వేసుకునేందుకు శక్తియుక్తులు కూడగట్టుకుంటారు. ఇదిగో ఈ యువకులకు ఒకప్పుడు కనుచూపుమేరంతా శూన్యంగానే ఉండేది. ఆ చీకటిని పారదోలి జీవితంలో కొత్త వెలుగులు తెచ్చుకునేందుకు వారు పడిన కష్టం స్ఫూర్తిదాయకం.

అసలే పేదరికం.. ఆపై అమ్మానాన్నలు దూరం

మామడ మండలం న్యూసాంగ్వి గ్రామానికి చెందిన గంగారెడ్డి-భూమవ్వ దంపతులకు సుమన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి ఇద్దరు సంతానం. కొద్దిపాటి వ్యవసాయం ఉన్నా అంతగా గిట్టుబాటయ్యేది కాదు. నిత్యం కష్టాలమయంగానే ఉండేది. ఈ పరిస్థితుల్లో ఉన్నట్టుండి తండ్రి గంగారెడ్డి మరణించారు. అప్పుడు సుమన్ ఇంటర్ చదువుతున్నారు. సంపాదనకు ఏకైక ఆధారమైన నాన్న కాలం చేయడంతో ఎటూ పాలుపోలేదు. ఇదే తరుణంలో అమ్మ భూమవ్వ మృతి చెందారు.



తమ్ముడు సురేష్‌తో అన్న సుమన్‌రెడ్డి

తమ్ముడే తండ్రయ్యాడు..

అంతా శూన్యంలా మారినా ఆ సోదరులు తడబడలేదు. అన్నా.. నువ్వు బాగా చదువుకో నేను కష్టపడి డబ్బు సంపాదిస్తానంటూ తమ్ముడు సురేష్ ఉపాధి కోసం దుబాయ్ బాట పట్టారు. ఆయన సహకారంతో సుమన్ డిగ్రీ, పీజీ, పోటీ పరీక్షలకు సన్నద్ధమై అన్నీ విజయవంతంగా పూర్తి చేశారు.

● 'మన కష్టాలను మనమే ఎదుర్కోవాలి.. ఉన్నచోటు నుంచి ఉన్నత స్థానానికి వెళ్లాలంటే ప్రణాళిక, పట్టుదల చాలా కీలకం. మన ఇబ్బందులపై ఇతరులు తాత్కాలికంగా సానుభూతి చూపిస్తారు. కానీ మనతో కలిసి నడిచే వారుండరు. ఆత్మవిశ్వాసంతో విజయం వైపు అడుగులు వేయడమే నా విజయానికి కారణమని ఆ యువ గెజిటెడ్ అధికారి సుమన్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు'.

పీజీలు 'రెండు' బంగారు పతకాలు

సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసిన పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఆంత్రోపాలజీ, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. చదువు ప్రతిభతో రెండింటిలో బంగారు పతకాలు సాధించారు. యూజీసీ నెట్, తెలంగాణ సెట్ అర్హత సాధించారు.

ఇవీ సాధించిన ఉద్యోగాలు

✦ గురుకులాల్లో పాఠశాల, మాధ్యమిక, డిగ్రీ కళాశాల (2023 సంవత్సరంలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా పరీక్షలు రాసి) లైబ్రేరియన్‌గా ఏడాది కాలంలోనే మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

✦ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లైబ్రేరియన్ ఉద్యోగానికి 2022 నోటిఫికేషన్‌లో పరీక్ష రాసి ఆ కొలువు సాధించారు. ప్రస్తుతం బెంగళూరు రీజియన్ బగల్‌కోట్ కేంద్రీయ విద్యాలయంలో గ్రంథాలయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

✦ తాజాగా విడుదలైన పాలిటెక్నిక్ కళాశాల లైబ్రేరియన్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో 8వ ర్యాంకు, బాసర జోన్‌లో మొదటి ర్యాంకుతో ఏడాది కాలంలోనే తన ఐదో ఉద్యోగాన్ని సాధించారు. సొంతూరుకు చేరువలోనే నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సుమన్ పోస్టింగ్ లభించింది. ఈ కొలువుకు గెజిటెడ్ అధికారి హోదా ఉండటంతో కేంద్రీయ విద్యాలయం ఉద్యోగాన్ని వదులుకున్నారు.


పశువుల కాపరి కుమారుడు అయ్యాడు ఉపాధ్యాయుడు..



జన్నారం, న్యూస్‌టుడే: కడు పేదరికం.. నాన్న పశువుల కాపరిగా పనిచేస్తే వచ్చే కూలీ డబ్బులే వారికి కడుపు నింపేది. కష్టపడి చదివి నాన్న కష్టాల్లో పాలు పంచుకోవాలని కలలు కన్నాడు. అయితే తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది. ఇంటర్ చదివే సమయంలో తండ్రి మృతి చెందడంతో చదువు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ఎన్నో ఇక్కట్లు అధిగమించి ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ కొలువు సాధించారు.

జన్నారం మండలం మొర్రిగూడ ఎస్సీ కాలనీకి చెందిన సంతపురి చిన్నులు-మల్లవ్వ దంపతుల కుమారుడు సంతపురి అశోక్ జీవశాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మంచిర్యాల జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 21వ ర్యాంకు సాధించగా ఎస్సీ విభాగంలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. చిన్న తనం నుంచే చదువుపై ఆసక్తి ఉన్న అశోక్ ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాడు. ప్రాథమిక విద్య మొర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో, ఆరు నుంచి ఇంటర్ వరకు ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహం, డిగ్రీ నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో, పీజీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసిన అశోక్ బీఈడీ నిజామాబాద్‌లో చదివారు. ఇంటర్‌లో తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోయింది. చదువు పూర్తి కాగానే 2021లో వెన్నెలతో వివాహమైంది. అన్నయ్యలు శ్రీనివాస్, శంకర్, భార్య వెన్నెల, ఇద్దరు అక్కయ్యలు, చిన్ననాటి మిత్రుల సహకారంతోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి కొలువు సాధించానని, పేద విద్యార్థుల చదువుకు తనవంతు సహకారం అందిస్తానని అశోక్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కటిక పేదరికాన్ని జయించి కొలువు సాధించిన అశోక్‌ను కాలనీ వాసులు అభినందించారు.

పులి సంచారం.. భయం భయం!



కెరమెరి, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో పులి సంచారం స్థానికులను కలవరపెడుతోంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మండలంలోని పరందోలి, కరంజివాడ, లక్మాపూర్, ఇందాపూర్ గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లో పులి సంచరించిన విషయం విదితమే. కాగా ఈ వారంలో మండలంలోని కెరమెరి ఘాట్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎలాంటి ఉచ్చులు, విద్యుత్తు తీగలు అమర్చవద్దని, అటవీ సమీప గ్రామాలవాసులు అప్రమత్తంగా ఉండాలని జోడేఘాట్ ఎఫ్ఆర్ఓ జ్ఞానేశ్వర్ సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారిణి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సబ్-జూనియర్స్ విభాగంలో కీర్తి అగర్వాల్ 15 నుంచి హరియాణాలో నిర్వహించే పోటీలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఖేలో ఇండియా కేంద్రం శిక్షకుడు రాజేష్ శిక్షణలో ప్రతిభ చాటుతున్న ఆమెను జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి రాజ్‌వీర్ అభినందించారు.



క్రీడాకారిణి కీర్తి అగర్వాల్‌తో శిక్షకుడు రాజేష్



బాసరలో శోభాయాత్ర

బాసరలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవాలు ముగియడంతో అమ్మవారికి అభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాసర గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి అశ్వరథంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గ్రామంలోని మహిళలు, యువతులు నృత్యాలతో స్వాగతం పలికారు.



తనికెళ్ల భరణి మనవడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు



సరస్వతి అమ్మవారి సన్నిధిలో నిర్మాత దిల్‌రాజు దంపతులు

దర్శించుకున్న ప్రముఖులు

జ్ఞాన సరస్వతిని ఆదివారం సినీనటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాత దిల్‌రాజు బాసరలోని వేదభారతి పాఠశాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పక్షాన వారిని సన్మానించిన వేదపండితులు తీర్థప్రసాదాలను అందజేశారు.

తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా..

త్వరలో ఆదిలాబాద్ మీదుగా మూడు కొత్త రైళ్లు



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం : ఉమ్మడి ఆదిలాబాద్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా మూడు కొత్త రైళ్లు పట్టాలెక్కనున్నాయి. ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రైళ్ల కూతలు త్వరలో వినిపించనున్నాయి. కాజీపేట నుంచి మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ఈ రైళ్లు వయా ఆదిలాబాద్ మీదుగా రాకపోకలు సాగించనుండటంతో ఇరుప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది. గతంలోనే కాజీపేట-ముంబయికి ఉన్న తాడోబా ఎక్స్‌ప్రెస్ రైలు తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా వారానికొకసారి నడిచేది. కరోనా సమయంలో రద్దుచేశారు. తాజాగా ఈ మార్గంలో రైలు మళ్లీ పునరుద్ధరించనున్నారు. మూడు ప్రత్యేక వారాంతపు రైళ్లకు సంబంధించి సమయసారిణి జారీ కావడం శుభపరిణామం. వీటి ప్రారంభానికి సంబంధించి ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది.

✦ కాజీపేట-పుణె ఎక్స్‌ప్రెస్ రైలు వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ మీదుగా ఉత్తరంవైపున ఉన్న మహారాష్ట్రలోకి ప్రవేశించి బల్లార్ష, మాంజిరి నుంచి తిరిగి పశ్చిమదిశలో తెలంగాణలోకి వచ్చి ఆదిలాబాద్‌కు చేరుకుంటుంది. ఆదిలాబాద్ మీదుగానే మళ్లీ పశ్చిమ ప్రాంతంలోని మహారాష్ట్రవైపున మన్మాడ్ చేరుకొని అక్కడి నుంచి నాందేడ్, ఔరంగాబాద్ మీదుగా పుణె వైపు మళ్లుతుంది. వారానికొకసారి నడిచే ఈ రైలు ప్రతి బుధవారం ఉదయం 6.35 గంటలకు పుణె నుంచి ప్రారంభమై గురువారం ఉదయం 6.30 గంటలకు కాజీపేట చేరుకుంటుంది. మధ్యలో ఆదిలాబాద్‌లో రాత్రి 11.45 గంటలకు అందుబాటులో ఉంటుంది. ప్రతి గురువారం ఉదయం 8 గంటలకు కాజీపేట నుంచి బయలుదేరి పుణె వెళుతూ ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 3.15 గంటలకు అందుబాటులో ఉంటుంది. పుణెకు శుక్రవారం రాత్రి 9.45 గంటలకు చేరుకుంటుంది.

✦ కాజీపేట-దాదర్ ప్రత్యేక రైలు(స్పెషల్ రైలు) సైతం మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా బల్లార్ష, వని, లింగ్టి నుంచి ఆదిలాబాద్‌కు మళ్లుతుంది. తిరిగి మహారాష్ట్రలోని కిన్వట్, నాందేడ్, ఔరంగాబాద్, పుణె మీదుగా దాదర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. కాజీపేట నుంచి శనివారం ఉదయం 11.30 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలకు మధ్యాహ్నం 12.59 గంటలకు, బెల్లంపల్లిలో మధ్యాహ్నం 1.19 గంటలకు, కాగజ్‌నగర్‌కు 2 గంటలకు, ఆదిలాబాద్‌కు రాత్రి 8.30 గంటలకు చేరి ప్రయాణికులను ఎక్కించుకుంటుంది. దాదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు చేరుతుంది. అదే దాదర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు కాజీపేటకు బయలుదేరే రైలు ఆదిలాబాద్‌లో సోమవారం ఉదయం 11.10 గంటలకు, కాగజ్‌నగర్ స్టేషన్‌లో సాయంత్రం 6.45 గంటలకు, బెల్లంపల్లిలో రాత్రి 7.05 గంటలకు, మంచిర్యాలలో రాత్రి 7.19 గంటలకు చేరి అక్కడి నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు కాజీపేట గమ్యానికి చేరుతుంది.

✦ కరీంనగర్-పుణె వారానికొకసారి స్పెషల్‌రైలు నడపనున్నారు. ప్రతి బుధవారం కరీంనగర్ నుంచి బయలుదేరి వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లార్ష, మాంజిరి, ఆదిలాబాద్ మీదుగా పుణెకు వెళుతుంది. కరీంనగర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలలో ఉదయం 7.16 గంటలకు, కాగజ్‌నగర్‌లో 8.50 గంటలకు, ఆదిలాబాద్‌కు మధ్యాహ్నం 1.45 గంటలకు రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. పుణెకు గురువారం ఉదయం 9.45 గంటలకు చేరుకుంటుంది. అదే పుణె రైల్వేస్టేషన్ నుంచి కరీంనగర్‌కు వచ్చే రైలు అక్కడ సోమవారం రాత్రి 10.45 గంటలకు బయలుదేరే రైలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆదిలాబాద్‌లో, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాత్రి 10.48 గంటలకు, మంచిర్యాలకు రాత్రి 11.36 గంటలకు చేరుకుంటుంది.

రూ.54.70 కోట్ల మద్యం తాగేశారు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఈ ఏడాది దసరా సందర్భంగా పక్షం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.54.70 కోట్ల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. గత సంవత్సరం కంటే ఇది రూ.9.15 కోట్లు అధికం. గతేడాది దసరా సందర్భంగా 12 రోజుల్లో రూ.45,54,55,135 మద్యం విక్రయాలు జరగగా ఈ ఏడాది రూ.54,69,95,145 మద్యం అమ్ముడైంది.

ఉమ్మడి జిల్లాలో దసరా సందర్భంగా పక్షం రోజుల్లో జరిగిన అమ్మకాలు జిల్లాల వారీగా (రూ.లలో)

జిల్లా	గతేడాది	ఈ ఏడాది విక్రయాలు
ఆదిలాబాద్	8,23,70,060	11,10,90,368
నిర్మల్	11,03,53,360	12,06,32,027
కుమురంభీం	5,75,21,925	7,62,75,947
మంచిర్యాల	20,52,09,790	23,89,96,803
మొత్తం	45,54,55,135	54,69,95,145

చేయూతతో.. చేనేతల్లో ఆనందం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:

రెక్కల కష్టాన్ని నమ్ముకుని కులవృత్తితోనే ఏళ్ల తరబడి చేనేతలు జీవనం సాగిస్తున్నారు. చేసిన పనికి గిట్టుబాటు ధర లభించనప్పటికీ, మరో పని చేయలేక అదే వృత్తిలో కొనసాగుతున్నారు. సహకార సంఘాలు వారికి కొంత మేరకు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇటీవల 'చేనేతకు చేయూత' పథకంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో.. చేనేత కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తే తమ జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు, కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం కోసినిలో కొనసాగుతున్నాయి. కోసినిలోని సహకార సంఘం అయిదు దశాబ్దాల కిందట 80 మంది కార్మికులతో ప్రారంభమైంది. ప్రభుత్వ చేయూత కొరవడటంతో ప్రస్తుతం 30 మందికి తగ్గిపోయింది. చెన్నూరులో 1949లో సహకార సంఘం ఏర్పాటు కాగా 40 మంది సభ్యులతో ప్రారంభమైన సంఘం దినదినాభివృద్ధి చెందుతూ 500 మంది కార్మికులతో విజయవంతంగా కొనసాగింది. చెన్నూరుతోపాటు కోటపల్లి, జైపూర్, వేమనపల్లి, నెన్నెల మండలాల కార్మికులు సంఘంలో చేరి వస్త్రాలు నేశారు. అనంతర కాలంలో ఈ రెండింటికీ ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం, నూలు వస్త్రాల దిగుమతిలో ఇబ్బందులు, తదితర కారణాలతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు కార్మికులకు చేతినిండా ఉపాధి కల్పించి అనంతరం ఏర్పడ్డ పరిస్థితులతో వస్త్రాలు నేస్తున్న కార్మికులకు కూలీ గిట్టుబాటు కాకపోవడం, అప్పటి ప్రభుత్వాలు సహకారం లేకపోవడంతో.. చాలా మంది పనిమానేశారు.



కోసిని సొసైటీలో వస్త్రం నేస్తున్న చేనేత కార్మికురాలు

గడువులోపే..

చేనేతలకు ప్రభుత్వం 'చేనేతకు చేయూత' పథకం ప్రారంభించగా.. కార్మికులు 2021లో చేరి నెల నెలా ఆర్డీ రూపంలో నగదు జమ చేశారు. కార్మికుడు ప్రతి నెలా తన ఖాతాల్లో రూ.500 జమ చేస్తే ప్రభుత్వం మరో రూ.వెయ్యి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. పథకం 2021 సెప్టెంబర్‌లో ప్రారంభమై 2024 ఆగస్టుతో ముగిసింది. మూడు సంవత్సరాల పాటు కార్మికులు ఆర్డీ రూపంలో జమ చేసిన సొమ్ము ప్రభుత్వం ఇవ్వాల్సిన రెండింతల సొమ్ము కార్మికుల ఖాతాల్లో ఇటీవలే జమ కావడం వారిలో కొంత ఊరటనిచ్చింది. ఈ పథకాన్ని కొనసాగిస్తే తమకు కొండంత అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పథకాన్ని కొనసాగించాలి

-నల్ల కనకయ్య, చేనేత సహకార సంఘం కార్యదర్శి, కాగజ్‌నగర్



చేనేతకు చేయూత పథకంలో సొసైటీ కార్మికుల ప్రతి నెలా మూడు సంవత్సరాలపాటు నగదు జమ చేశారు. ఇటీవలే ప్రభుత్వ వాటా కలిపి నిధులు విడుదల చేయడం సంతోషాన్నిచ్చింది. తిరిగి ఈ పథకాన్ని కొనసాగిస్తే కార్మికులకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లవుతుంది. సంఘాల్లో సభ్యుల సంఖ్య పెరిగి అభివృద్ధి సాధిస్తాయి. కార్మికులకు అమలు చేస్తున్న నేతబీమా పథకం 75 సంవత్సరాల వయసుకు పెంచాలి. చాలా మంది సంఘంలో వృద్ధులు ఉన్నందున బీమా పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి. 2020లో తీసుకున్న ముద్ర రుణాలు మూడేళ్ల పాటు వడ్డీతో కలిపి చెల్లించారు. రుణం మొత్తాన్ని మాఫీ చేయాలి.

తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా పి.రాజేశ్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : చాంద(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న పి.రాజేశ్ తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా ఎంపికయ్యారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఈ నెల 17 నుంచి 19 వరకు ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన తెలంగాణ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించి ఎన్నో పతకాలు సాధించిన ఆయన జిల్లా జట్టుకు తొమ్మిదిసార్లు రాష్ట్రస్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రావడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రతిభను గుర్తించి తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం తెలంగాణ అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా నియమించింది. ఈ ఘనత సాధించినందుకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, జిల్లా క్రీడాధికారులు వేంకటేశ్వర్లు, పార్థసారథి ఆయనకు అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, గుడిహత్నూర్:

? గుడిహత్నూర్ మండలం డొంగర్‌గావ్ పంచాయతీలోని వైకుంఠ ధామంలో కనీస సౌకర్యాలు లేవు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియల కోసం ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. - **దోమకొండ సుధాకర్, డొంగర్‌గావ్**

✔ మండలంలోని ఆయా గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేని వైకుంఠ ధామాలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం. - **అబ్దుల్ హై, ఎంపీడీఓ గుడిహత్నూర్**

న్యూస్‌టుడే, తలమడుగు:

? తలమడుగు మండలంలోని అర్లి(టి) గ్రామం దశాబ్దకాలంగా రహదారి నిర్మాణానికి నోచుకోవడంలేదు. రూ.2.50 కోట్లు మంజూరైనా గుత్తేదారు పనులు ప్రారంభించడం లేదు. - **సురేందర్‌రెడ్డి, అర్లి(టి)**

✔ పీఎంజీఎస్‌వైలో టెండర్ పూర్తయింది. గుత్తేదారుకు జిల్లాలో పనుల తీవ్రత ఎక్కువ ఉండటం, జిల్లాలో గుత్తేదారుల కొరత తీవ్రంగా ఉండటంతో నిర్మాణ పనుల్లో జాప్యమైంది. పనులను వేగవంతం చేసే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - **సుధాకర్, ఏఈ, పీఆర్ పంచాయతీరాజ్**

న్యూస్‌టుడే, బోథ్:

? బోథ్ మండలం సొనాల సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై టీవీటీ క్రాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఎలాంటి సూచికలు లేవు. - **స్థానికుడు, బోథ్**

✔ సూచికలు ఏర్పాటు చేస్తాం. - **ప్రవీణ్, ఎస్‌ఐ, బోథ్**

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్:

? ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిత్యనగర్ ప్రధాన రహదారి వర్షానికి బురదమయంగా మారింది. రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిగా మారింది. - **హరీశ్, స్థానికుడు**

✔ ఆదిత్యనగర్ ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్ నిర్వహించి పనులు చేపడతాం. - **తిరుపతి, డీఈఈ, బల్దియా**

రహదారి ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : దసరా పండగ ఆ కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది. రహదారి ప్రమాదంలో భాగ్యనగర్‌కు చెందిన గట్టి వార్ గిరీష్(22) మృత్యువాత పడగా, అదే కాలనీకి చెందిన ఆతడి మిత్రుడు బత్తుల నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మరో స్నేహితుడు జనగామ్‌వార్ అనిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మావల ఎస్సై విష్ణు వర్ధన్ వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున భాగ్యనగర్‌కు చెందిన ముగ్గురు స్నేహితులు ఆదిలాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో గిరీష్ అక్కడికక్కడే చనిపోయాడు. గాయపడిన ఇద్దరు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గిరీష్

గుండెపోటుతో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని పోలీసు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో విధులు నిర్వహించే ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ వీరమల్ల కిషన్(58) గుండెపోటుతో మృతి చెందారు. పెద్దపల్లి వాస్తవ్యుడు అయిన ఆయన కొన్నాళ్లుగా హైదరాబాద్ పీటీఓలో విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లో నివాసం ఉండే తోడల్లుడు(సడ్డకుడు) విశ్రాంత ఎస్సై రామారావు ఇంటికి శుక్రవారం దసరా పండగ కోసం వచ్చారు. ఆదివారం ఉదయం తిరిగి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నప్పుడు గుండెపోటుకు గురయ్యారు. ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెందటం పట్ల డీఎస్పీ జీవన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

ప్రమాదానికి కారణమైన ఎస్‌ఐపై చర్యలకు డిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ప్రమాదానికి కారణమైన గాదిగూడ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుడి బంధువులు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గాదిగూడ ఎస్సై మహేశ్ నిర్లక్ష్యంగా కారు నడిపి లోకారి వద్ద ఆతిఖ్ అనే వ్యక్తిని ఢీకొట్టాడు. ఆతడి కాలు నుజ్జునుజ్జు అయింది. చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయం చేస్తానని చెప్పిన ఎస్సై అప్పటికప్పుడు రూ.పది వేలు ఇచ్చాడన్నారు. అనంతరం పట్టించుకోవటం లేదని వారు వాపోయారు. ఈ విషయమై వారు ఆదివారం నార్నూర్‌లో సీఐ రహీంపాషాను కలిశారు. ప్రమాద విషయం సీఐని 'న్యూస్‌టుడే' అడగగా.. వారు సోమవారం ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : భాగ్యనగర్‌కు చెందిన యువతి(19) అదృశ్యం కేసును ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు ఆదివారం నమోదు చేశారు. సీఐ కరుణాకర్‌రావు వివరాల మేరకు.. శనివారం రాత్రి అమ్మమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం బంధువుల ఇళ్లల్లో గాలించిన అనంతరం సాయంత్రం పోలీసులకు ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : రామాయిలో ఆదివారం బేల మండలం సైదిపూర్, రామాయి గ్రామాలకు చెందిన కొందరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం.. వాహనం శబ్ద తీవ్రత(హారన్) కారణంగా ఇరువురి మధ్య మొదలైన వాగ్వాదం గొడవకు దారి తీసింది. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఒకరికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


నేరడిగొండ : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


తాంసిలో దుర్గమ్మ పల్లకి ఊరేగింపులో భక్తులు


ఉట్నూరు : పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దంపతులు


డైట్ మైదానంలో పూజలు చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి-మౌనారెడ్డి దంపతులు, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు, సనాతన హిందూ ఉత్సవ సమితి బాధ్యులు


డైట్ మైదానంలో దహనమవుతున్న రావణుడి బొమ్మ

ఘనంగా దసరా వేడుకలు

ఆదిలాబాద్ నేర విభాగం, ఆదిలాబాద్ క్రీడా విభాగం, ఆదిలాబాద్ సాంస్కృతికం, తలమడుగు, ఉట్నూరు గ్రామీణం, బోథ్, ఇచ్చోడ(నేరడిగొండ), సిరికొండ, ఇచ్చోడ, ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్, గుడిహత్నూర్, బేల, తాంసి, బజార్‌హత్నూర్, ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చెడుపై మంచి విజయానికి సంకేతంగా నిలిచే దసరా పండగను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మండపాల్లో భక్తులు పూజలు చేశారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్దకు వెళ్లి జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఆయుధ పూజ, వాహన పూజలు చేపట్టారు. కార్యాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రావణాసురుడి ప్రతిమను దహనం చేసి సంబరాలు చేసుకున్నారు.


ఇంద్రవెల్లిలో నృత్యాలు చేస్తున్న మహిళలు


తంతోలి రోడ్డులోని భీమన్న దేవస్థానంలో భక్తుల సందడి


బజార్‌హత్నూర్ మున్నూరు కాపు సంఘం నాయకులు


బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజలో సీఐ రమేష్, ఎస్‌ఐ ప్రవీణ్


నాగోబా ఆలయానికి వెళుతున్న మెస్రం వంశీయులు


ఉట్నూరు: లక్కారం నుంచి రాజుల కోటకు పూజల కోసం వెళ్తున్న ఆత్రం రాజాదేవుషా గంగాధర్ వంశీయులు


తలమడుగులో


బేలలో..


ఇచ్చోడ: పూజల్లో సీఐ భీమేష్

హిందూ ఉత్సవ సమితి ఒంటెద్దు పోకడలు మానుకోవాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : హిందూ ఉత్సవ సమితి ఒంటెత్తు పోకడలు మానుకోవాలని మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు కాళ్ల విఠల్ సూచించారు. స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలో పురపాలక అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ పేరు ముద్రించకపోవటం, ఉత్సవాల్లో ఆయనను వేదికపైకి పిలువక పోవటం పట్ల ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడి తీరును పురపాలక కౌన్సిల్ ఫోరం తీవ్రంగా ఖండిస్తోందని ఫోరం అధ్యక్షుడు బండారి సతీష్ అన్నారు. సమితి అధ్యక్షుడు బొంపల్లి హన్మాండ్లు తన వైఖరిని మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



పాత్రికేయులతో మాట్లాడుతున్న మున్నూరు కాపు తాలూకా అధ్యక్షుడు కాళ్ల విఠల్

అక్కాచెల్లెళ్లకు సన్మానం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ రాంనగర్‌కు చెందిన డిప్యూటీ తహసీల్దార్ కుమ్ర మధుకర్ కుమార్తె సాయిప్రియ ఇటీవల డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపిక కాగా.. మరో కూతురు వర్ణతేజ ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. వారిని పర్ధాన్ సమాజ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆదివాసీల అభివృద్ధికి అండగా ఉంటాం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదివాసీల అభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందజేస్తామని ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. నార్నూర్ మండలం మరపగూడకు చెందిన ఆదివాసీ విద్యార్థి పూసం అశోక్‌కు టీటీఆర్ ఎంబీబీఎస్ కళాశాలలో సీటు వచ్చినా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చేరలేదన్న విషయం ఎస్పీ తెలుసుకున్నారు. క్యాంపు కార్యాలయానికి పిలిపించి ఇన్‌ఛార్జి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో కలిసి రూ.50 వేల నగదు సాయం అందించారు. ఉట్నూర్ సీఐ మొగిలి, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, మెస్రం గంగారాం, మెస్రం ఇస్రూ పాల్గొన్నారు.


అశోక్‌కు ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేతో కలిసి నగదు అందజేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

కథల పోటీల్లో లక్ష్మీపూర్ విద్యార్థిని ప్రతిభ

జైనథ్, న్యూస్‌టుడే : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో జైనథ్ మండలం లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన తల్లెల కీర్తి రాసిన 'తెలుగులోనే' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ ఆదివారం తెలిపారు. ఈ కథల పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 232 కథలు రాగా అందులో 28 మంది విద్యార్థులు రాసిన కథలను ఉత్తమ కథలుగా ఎంపిక చేసినట్లు మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వాహకులు మాచిరాజు కామేశ్వరరావు తెలిపారన్నారు. కీర్తికి నవంబరు 3న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సన్మానంతో పాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు బాల సాహిత్యానికి చెందిన పుస్తకాలు అందజేస్తారన్నారు.


తల్లెల కీర్తి

ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీరు సరికాదు

ఆదిలాబాద్ అర్బన్: ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఏకపక్ష నిర్ణయాలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దసరా వేడుకల ఆహ్వాన పత్రికలో మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అయిన తన పేరు లేకుండా నిర్వహించడం సరికాదన్నారు. రాంలీల మైదానంలో మహిళలు బతుకమ్మ ఆడితే గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి అడ్డుకోవడాన్ని తప్పు పట్టారు.

పట్టుకున్నారు.. ఆపై మల్లగుల్లాలు

ఎదులాపురం: అహ్మదాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు రైలులో వచ్చిన రూ.3 లక్షల తంబాకు పొట్లాలను జీఆర్పీ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వాటిని తరలించిన యజమాని అది నిషేధిత జాబితాలో లేదని వాదించటంతో పోలీసులు దినమంతా మల్లగుల్లాలు పడ్డారు. రైలులో తంబాకు పొట్లాల నిల్వలు వచ్చాయని టూటౌన్ పోలీసులకు సమాచారం అందటంతో స్వాధీనం చేసుకున్నారు. అది రైల్వే పోలీసుల పరిధిలోకి రావటంతో వాటిని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. అవి నిషేధిత జాబితాలో ఉన్నాయా? లేదా? అనే విషయం తెలుసుకోవటానికి రైల్వే పోలీసులు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీసినా సంబంధిత అధికారి అందుబాటులో లేక తిరిగి వాటిని రైల్వే స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై జీఆర్పీ ఇన్‌ఛార్జి అధికారి భోజన్నను వివరణకోరగా.. దర్యాప్తు జరుగుతోందని, ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఒక్కోరూపం.. అపురూపం


తాంసిలో ధనలక్ష్మి బతుకమ్మ


కప్పర్లలో..

తాంసి, బోథ్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా శనివారం బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. పాటలు పాడుతూ కోలాటమాడారు. బోథ్, సొనాల గ్రామాలలో బతుకమ్మ పాటలపై మహిళలు నృత్యాలు చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో పూలతో భారీ బతుకమ్మను పేర్చారు. స్థానిక వాగులలో నిమజ్జనం చేశారు.


బోథ్‌లో బతుకమ్మలతో మున్నూరుకాపు సంఘం మండలి మహిళలు


బోథ్ : భారీ బతుకమ్మ


సైకిళ్లను అందజేస్తున్న ఎస్పీ అబ్దుల్ బారీ

40 సైకిళ్ల పంపిణీ

ఎదులాపురం, న్యూస్‌టుడే : హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో ఎస్పీగా పని చేస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన అబ్దుల్ బారీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌నగర్ అర్ఫాత్ మసీదులో 40 మంది పిల్లలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో పదో తరగతి చదివిన 1978 బ్యాచ్‌కు చెందిన మిత్రులంతా కలిసి రూ.1.40 లక్షల సైకిళ్లను పంపిణీ చేసినట్లు అబ్దుల్ బారీ తెలిపారు. అర్ఫాత్ మసీదులో వరుసగా 40 రోజుల పాటు వేకువజామున ప్రార్థనల(ఫజర్ నమాజ్)కు హాజరైన పిల్లలను ఎంపిక చేసి వాటిని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. హెచ్‌డబ్ల్యూఏ ప్రతినిధి ఇంతెఖాబ్ ఆలం, 1978 పదో తరగతి బ్యాచ్ మిత్రులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దివ్యాంగుల హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడి నియామకం

బోథ్: భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా బోథ్‌కు చెందిన నారాయణ ఆదివారం నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ఉత్తర్వులను జారీ చేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

బోథ్: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. బోథ్‌లో ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానించారు. సాయికృష్ణ, నరేష్, కార్తిక్, రమణాగౌడ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

బోథ్: బోథ్ మండలం కౌఠలో సోమవారం వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు అబ్బుల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అన్నదానానికి 195 వారాలు

ఎదులాపురం: సంగెం ఛారిటబుల్ ట్రస్ట్ కొనసాగిస్తున్న అన్నదాన కార్యక్రమం ఈ ఆదివారం నాటికి 195 వారాలకు చేరుకుంది. ఆదివారం వద్దం కుర్సుకుండులో అన్నదాన కార్యక్రమాన్ని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి మార్చి నిరుపేదల ఆకలి తీర్చారు. ట్రస్ట్ ప్రతినిధులు వెంకటేష్‌రెడ్డి, ఛైర్మన్ సంగెం సుధీర్‌కుమార్, మహేందర్‌రెడ్డి, సుభాష్, రాజయ్య, అంబయ్య పాల్గొన్నారు.

తాత్కాలిక కమిటీ నియామకం

ఆదిలాబాద్ పట్టణం: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జిల్లా తాత్కాలిక కమిటీని నియమించారు. కమిటీ జిల్లా కన్వీనర్‌గా పి.దేవేందర్, కోకన్వీనర్‌గా ఎం.రాజేశ్వర్‌లను నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమానికి, ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేయనున్నట్లు కమిటీ కన్వీనర్, కోకన్వీనర్లు తెలిపారు.

ప్రయాణికులకు ఆర్టీసీ అధికారుల స్వాగతం

ఆదిలాబాద్ అర్బన్: విజయదశమి పండగకు పుణ్యక్షేత్రాలకు వెళ్లి వచ్చిన ప్రయాణికులకు శనివారం ఆర్టీసీ అధికారులు పూలు అందజేసి స్వాగతం పలికారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వద్ద పూజలు చేసి ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. డిపో మేనేజర్ కల్పన, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎంఎఫ్ శ్రీకర్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి: ముత్నూరు గ్రామ శివారు ప్రధాన రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం మండలంలోని గౌరాపూర్ పంచాయతీ పరిధి మోహన్‌సింగ్‌తండాకు చెందిన దేవీదాస్(30) తన పిల్లలతో ఇంద్రవెల్లి మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనక నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దేవీదాస్‌కు గాయాలవగా 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించినట్లు పైలట్ ఆత్రం అశోక్ తెలిపారు.

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన సీనియర్ నేత వివేక్

ఉట్నూరు, న్యూస్‌టుడే : కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆదివారం ఉట్నూరులోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా తొలుత ఎమ్మెల్యే దంపతులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు ఎమ్మెల్యేలు కలిసి కాసేపు మాట్లాడుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానించారు.

భీం వర్ధంతికి తరలిరావాలి

ఇంద్రవెల్లి: కుమురం భీం వర్ధంతి సభను విజయవంతం చేసేందుకు ఆదివాసీలు జోడేఘాట్‌కు తరలిరావాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు, కుమురం భీం వర్ధంతి నిర్వహణ కమిటీ ఛైర్మన్ పెందూర్ రాజేశ్వర్ పిలుపు ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో స్మారక స్తూపం వద్ద భీం వర్ధంతి గోడప్రతులను విడుదల చేశారు.

నాగోబా మెస్రం వంశీయుల దసరా పూజలు

ఇంద్రవెల్లి: నాగోబా మెస్రం వంశీయులు దసరా పండగ వేడుకలు జరుపుకున్నారు. శనివారం ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు ఆధ్వర్యంలో మెస్రం వంశస్థులు రాత్రి నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సంప్రదాయ వాయిద్యాలతో గ్రామంలోని మురాడి ఆలయంలో నాగోబా ప్రతిమలను శుభ్రం చేశారు. తర్వాత మురాడిలో మొక్కులు తీర్చుకుని నాగోబా ఆలయానికి బయల్దేరి వెళ్లారు.

ఎమ్మెల్యే బొజ్జు పూజలు

ఉట్నూరు గ్రామీణం: ఉట్నూరులోని తన నివాసంలో ఆయుధ, దసరా పూజలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నిర్వహించారు. అనంతరం పట్టణ కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. డీఎస్పీ నాగేందర్ పాల్గొన్నారు.

వచ్చే నెల 4 నుంచి పండరిపూర్ యాత్ర

ఉట్నూరు: విఠలేశ్వరుడి దర్శనం కోసం ఏటా ఉమ్మడి జిల్లా భక్తులు నిర్వహించే పండరిపూర్ యాత్రను నవంబరు 4న తేదీన కుమురం భీం జిల్లా జిల్లాపరిషత్ మాజీ ఛైర్మన్ కనక లక్కేరావు నుంచి ప్రారంభించనున్నట్లు జడ్పీ మాజీ వైస్‌ ఛైర్మన్ రాథోడ్ జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూరులో యాత్ర నిర్వహణ కమిటీ సభ్యులు తుకారామ్ మహారాజ్, ఆరికెల అశోక్, కొమ్ము రాంచందర్, కెర్మమహారాజ్‌లు జడ్పీ మాజీ ఛైర్మన్ ఇంటిలో చర్చించారు.


సమన్వయంతో ఇబ్బందుల్లో గిరిజనులు

ఇంద్రవెల్లి: గిరిజనులు సమన్వయంతో కొట్టుమిట్టాడుతున్నారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం దసరా సందర్భంగా హర్కాపూర్ తండాలో దుర్గాదేవి, సంత్ రామారావు మహారాజ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ నాయకుడు రితేష్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే రద్దు.. తర్వాత అనుమతి

ఆదిలాబాద్ సాంస్కృతికం: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో పదేళ్లుగా దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈసారి అక్కడ అనివార్య కారణాలతో నిర్వహించలేదు. డైట్ మైదానంలో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే డైట్ మైదానంలో దసరా వేడుకలకు అనుమతి లేదంటూ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి తొలుత ఉత్తర్వులు జారీ చేశారు. మరుసటి రోజు వేడుకలు నిర్వహణకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే వివేక్‌కు స్వాగతం పలుకుతున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సన్మానించారు. రాష్ట్ర మంత్రులతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు గుడిపెల్లి నగేష్, కలాల శ్రీనివాస్, మంచికట్ల ఆశమ్మ, లోక ప్రవీణ్‌రెడ్డి, శ్రవన్ నాయక్, సంజయ్‌రెడ్డి, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.